వారం పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు

- అన్ని జిల్లాలకు ఎల్లో, ఆరెంజ్ హెచ్చరికలు జారీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సోమవారం నుంచి ఆదివారం వరకు పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, ఎక్కువ ప్రాంతాల్లో మోస్తరు వానలు పడే సూచనలు బలంగా ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న హెచ్చరించారు. భారీ, అతి భారీ వర్షాల నేపథ్యంలో పలు జిల్లాలకు ఎల్లో, ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. నైరుతి రుతుపవనాలు చురుగ్గా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ నెల 13న వాయువ్య, పశ్చిమ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని పేర్కొన్నారు. ఆదివారం రాత్రి ఉదయం 8:30 గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు 400కిపైగా ప్రాంతాల్లో వర్షపాతం నమోదైనట్టు తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ పేర్కొంది. నిర్మల్ జిల్లా, మండలంలోని అక్కాపూర్‌లో అత్యధికంగా 11.08 సెంటీమీటర్ల వర్షపాతం కురిసింది.

సోమవారం భారీ వర్షం సూచన ఉన్న జిల్లాలు(ఎల్లో హెచ్చరిక) : ఆదిలాబాద్, కొమ్రంభీమ్ అసిఫాబాద్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి. (మిగతా జిల్లాలో మోస్తరు వానలు పడే అవకాశముంది)

మంగళవారం భారీ వర్ష సూచన ఉన్న జిల్లాలు(ఎల్లో హెచ్చరిక) : ఆదిలాబాద్, కొమ్రంభీమ్, అసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం (మిగతా జిల్లాల్లోనూ అన్ని ప్రాంతాల్లో వర్షం కురియొచ్చు)

బుధవారం అతి భారీ వర్ష సూచన ఉన్న జిల్లాలు (ఆరెంజ్ హెచ్చరిక) : ఆదిలాబాద్, కొమ్రంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు

భారీ వర్ష సూచన : హైదరాబాద, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, మెదక్, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట, జనగాం, హన్మకొండ, వరంగల్, మహబూబాబాద్, సూర్యాపేట, నల్లగొండ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నిర్మల్, రాజన్నసిరిసిల్ల, నిజామాబాద్.

గురువారం అతి భారీ వర్ష సూచన ఉన్న జిల్లాలు (ఆరెంజ్ హెచ్చరిక) : హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, యాదాద్రి భువనగిరి, మహబూబాబాద్, నల్లగొండ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, నిజామాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆదిలాబాద్, కొమ్రంభీమ్ అసిఫాబాద్.

భారీ వర్ష సూచన(ఎల్లో హెచ్చరిక) : రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంగ గద్వాల.

వికలాంగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వికలాంగుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ, వికలాంగుల, వయోవృద్ధుల, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. వికలాంగుల ఉద్యోగుల బదిలీల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ, మానసిక వికలాంగుల కుటుంబాలకు కూడా వర్తింప చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జిఒ 34 విడుదల చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ఆదివారం హైదరాబాద్‌లోని మినిష్టర్ క్వార్టర్‌లో డిఫరెంట్లీ అబ్లేడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంత్రితో పాటు కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యను గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ ద్వారా వికలాంగుల కుటుంబాల్లో ఆనందం చూడడమే ప్రజాపాలన లక్ష్యమని చెప్పారు. వారి స్వయం సమృద్ధి కోసం వేల సంఖ్యలో వికలాంగుల స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. బాధ్యతలు చేపట్టిన రోజే వికలాంగుల స్వయం సహాయక సంఘాలకు ఒక్కో సంఘానికి రూ. 15వేల చొప్పున 2,367 సంఘాలకు రూ.3.55కోట్లు, వ్యక్తిగత సబ్సిడీ రుణాల కోసం రూ.ఐదు కోట్ల ఫైలుపై సంతకం చేసినట్టు గుర్తుచేశారు. బిఆర్ఎస్ పాలనలో నిర్లక్ష్యానికి గురైన వికలాంగుల ఉద్యోగుల సమస్యలతోపాటు వారి సంక్షేమంలో మార్పులకు శ్రీకారం చుట్టనున్నట్టు తెలిపారు. కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని నిరంతరం వికలాంగుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని మంత్రి అభినందించారు. ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ గత బిఆర్ఎస ప్రభుత్వం వికలాంగుల ఉద్యోగుల బదిలీలపై ఉక్కుపాదం మోపిందని విమర్శించారు. నేటి ప్రజాపాలనలో జీవో 34ద్వారా వికలాంగుల ఉద్యోగుల బదిలీల్లో రిజర్వేషన్ కల్పించటమే గాక, మానసిక వికలాంగులకు కూడా బదిలీల్లో రిజర్వేషన్ కల్పించటం హర్షణీయమన్నారు.

వరద సమస్యకు శాశ్వత పరిష్కారం

- అక్రమ కట్టడాలపై చర్యలు తప్పవు
- ఐక్యతా లోపంతోనే ఈ దుస్థితి : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- అమీర్‌పేట్, సోమాజిగూడ ముంపు ప్రాంతాల్లో సిఎం పర్యటన



ముంపు ప్రాంతాల్లో పారిశుధ్య అధికారులకు, కార్మికులకు సూచనలు ఇస్తున్న సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సాధారణ వర్షానికే వరద ముంపునకు గురవుతున్న హైదరాబాద్ నగర సమస్యలన్నిటికీ శాశ్వత ప్రాతిపదికన పరిష్కారం చూపుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి అతలాకులతలమైన అమీర్‌పేట, సోమాజిగూడలోని పలు ప్రాంతాల్లో సిఎం రేవంత్ ఆదివారం అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికులతో మాట్లాడారు. తక్షణ ఉపశమనానికి తీసుకోవాల్సిన చర్యలపై సిఎం అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీచేశారు.

ఆయా ప్రాంతాల్లో వరద పరిస్థితిని హైడ్రా కమిషనర్ రంగనాథ్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్వి కర్ణన్ సిఎంకు వివరించారు. మైత్రివనం ప్రాంతంలోని గంగుబాయి బస్తీ, బుద్ధ నగర్‌లో డ్రయినేజీ వ్యవస్థను పరిశీలించారు. బస్తీ వాసులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బుద్ధ నగర్ కాలనీ రోడ్డు కంటే డ్రయినేజీ ఎక్కువ ఎత్తులో ఉండటంతో ఇరుకుగా మారి వరద తీవ్రత పెరుగుతోందని తెలుసుకున్నారు. వెంటనే డ్రయినేజీ సిస్టమ్‌ను రోడ్డు లెవల్ చేసి, వరద నీరు సాఫీగా వెళ్లేలా చూడాలని అధికారులకు సిఎం సూచించారు. అలాగే, గుంగూబాయి బస్తీ కుంటను కొంతమంది పూడ్చి వేసి పార్కింగ్‌కు వినియోగిస్తున్నారని స్థానికులు సిఎంకు ఫిర్యాదు చేశారు. ఒక ప్రత్యేక ట్రంక్ లైన్ ఏర్పాటు చేసి వరద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, వెంటనే ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజల కష్టాలు తెలిసి కూడా పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడానికి అడ్డంకులు ఏంటో తెలపాలని ప్రజాప్రతినిధులు, అధికారులను సిఎం అడిగారు.

పుస్తకాలన్నీ కరాబయ్యాయి సార్...

బుద్ధనగర్‌లో పర్యటిస్తున్న సమయంలో అక్కడ కనిపించిన బాలుడుని పిలిచి వరద పరిస్థితిపై సిఎం రేవంత్ ఆరాతీశారు. తన పేరు జశ్వంత్ అని, ఏడో తరగతి చదువుతున్నట్టు చెప్పాడు. వర్షం వస్తే భయంగా గడపాల్సి వస్తుందనీ, ఇళ్లల్లోకి నీళ్లు వస్తున్నాయని జశ్వంత్ సిఎంకు తెలిపారు. గత గురువారం కురిసన వర్షానికి ఇంట్లోకి వరద పోటెత్తడంతో పుస్తకాలు తడిసిపోయాయని నిత్యావసరాలు కరబయ్యాయని వివరించారు. స్పందించిన సిఎం, ఇకపై ఆ సమస్య ఉండదని అన్నారు. వరద నివారణకు వెంటనే చర్యలు తీసుకుంటామని రేవంత్ తెలిపారు.

ఈ పర్యటనలో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, ఆర్అండ్‌బి, జిహెచ్ఎంసి డిఎంసి ఇంజంగ్ ఎస్‌సి రత్నాకర్, అమీర్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ సరళ, సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్, అధికారులు పాల్గొన్నారు.

మల్టీ లెవెల్ పార్కింగ్‌కు తుది మెరుగులు

- దేశంలోనే అత్యంత ఆధునిక ఆటోమేటెడ్ పార్కింగ్ ప్రాజెక్ట్
- పది పార్కింగ్ అంతస్తులు, సినిమా థియేటర్లు
- పనుల ప్రగతిని పరిశీలించిన హెచ్ఎంఆర్ఎల్ ఎండి ఎన్‌విఎస్ రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో పార్కింగ్ కష్టాలను తీర్చే దిశగా ఒక అద్భుతమైన ప్రాజెక్టుకు హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు తుది మెరుగులు దిద్దుతోంది. ప్రపంచంలోనే అరుదుగా ఉండే పూర్తిస్థాయి ఆటోమేటెడ్ బహుళ అంతస్తుల పార్కింగ్ వ్యవస్థను హైదరాబాద్ నడిబొడ్డున నాంపల్లిలో నిర్మించామని హైదరాబాద్ మెట్రో రైల్ ఎండి ఎన్‌విఎస్ రెడ్డి వెల్లడించారు. నాంపల్లిలో జరుగుతున్న ఈ ప్రాజెక్టు పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ.. వివిధ ప్రభుత్వ శాఖల నుంచి తుది అనుమతులు లభించిన వెంటనే త్వరలోనే ఇది ప్రజలకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఈ ప్రాజెక్టును ప్రపంచశ్రేణి ప్రాజెక్టుగా అమల్లోకి తేవాలని చేసిన ఆదేశాల మేరకు అత్యంత ఆకర్షణీయంగా రూపొందిస్తున్నామని చెప్పారు. హెచ్ఎంఆర్ఎల్ ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టును పిపిపి విధానంలో 'నోవమ్' సంస్థ నిర్మించినట్టు తెలిపారు. ఇది జర్మనీకి చెందిన అత్యాధునిక 'పాలిస' సాంకేతికతతో పూర్తి ఆటోమేటెడ్ పజిల్ పార్కింగ్ సిస్టమ్‌గా నిర్మించబడిందని అన్నారు. నాంపల్లి మల్టీ లెవెల్ పార్కింగ్ ప్రాజెక్ట్ ప్రపంచంలోనే అత్యంత ఆధునికమైన పార్కింగ్ కాంప్లెక్సుల్లో ఒకటని, భారతదేశంలో ఇదే మొట్టమొదటిదని తెలిపారు. హెచ్ఎంఆర్ఎల్ రెండువేల చదరపు గజాల స్థలాన్ని 50 ఏండ్ల కన్సెషన్‌కు ఇవ్వగా, ప్రాజెక్టు డెవలపర్లు డాక్టర్ హరికిషన్ రెడ్డి, భావనా రెడ్డి వారి సొంత పెట్టుబడి రూ.102 కోట్లతో ఈ ప్రాజెక్టును నిర్మించారని తెలిపారు. మొత్తం 15 అంతస్తుల్లో పది పార్కింగ్ అంతస్తులు, అయిదు వాణిజ్యపరమైన కార్యకలాపాలకు కేటాయించారని అన్నారు. చక్కటి వసతులున్న రెండు సినీ థియేటర్లు ఈ కాంప్లెక్స్‌లో ఉన్నాయన్నారు. 11వ అంతస్తులో నగర వీక్షణకు ఒక గ్యాలరీ ఉంటుందని చెప్పారు. ఈ మల్టీ పార్కింగ్ అంతస్తుల్లో మొత్తం 250 కార్లు, 200 ద్విచక్ర వాహనాల పార్కింగ్ చేయొచ్చని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ పార్కింగ్ సమస్యలకు ఒక చక్కటి పరిష్కారం అందించడమే కాకుండా సాంకేతికత, వినియోగదారుల అనుభవం, భద్రత, సౌలభ్యం పరంగా దేశంలో ఒక కొత్త ప్రమాణాన్ని స్థాపించబోతోందని తెలిపారు.

ప్రతి ఎకరాకీ సాగునీరు అందేలా కృషి

- ఏడాదిలో జవహర్ ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలి
- బనకచెర్ల ప్రాజెక్టును అన్ని దశల్లో అడ్డుకుంటాం : డిప్యూటీ సిఎం భట్టి
- జవహర్ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన


కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం భట్టి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కృష్ణ, గోదావరి జలాలను వినియోగించుకుంటూ ఖమ్మం జిల్లాలోని ప్రతి ఎకరాకి సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. ఖమ్మం జిల్లా మధిర, ఎర్రుపాలెం మండలాలకు సాగునీరు అందించేందుకు మధిర మండలం వంగవీడు గ్రామంలో రూ.630 కోట్లతో చేపట్టిన జవహర్ ఎత్తిపోతల పథకం పనులకు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాకాటి శ్రీహరి, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, మట్ట రాగమయితో కలిసి భట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం భట్టి మాట్లాడుతూ.. మధిర ప్రాంతంలో లభించే నీటిని సద్వినియోగం చేసుకుంటేనే ఇక్కడ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఇప్పటికే కట్టలేరు ప్రాజెక్టు ఆధునీకరణ పూర్తి చేశామని తెలిపారు. 2012లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వం జవహర్ ఎత్తిపోతల పథకానికి మంజూరు ప్రతిపాదనలు పంపినట్టు చెప్పారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత ఈ పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు సంగతే పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మళ్లీ ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలు తీసుకొచ్చి సర్వే నిర్వహించి, నిధులు మంజూరు చేసినట్టు చెప్పారు. పాలేరు నుంచి సత్తుపల్లి వరకు నాగార్జున సాగర్ ఎడమ కాలువ ద్వారానే పంటలు పండుతున్నాయని అన్నారు. ప్రతి రోజూ 11 టిఎంసిల నీరు ఎపి తీసుకుంటుందని, ఈ దోపిడీ ఇలాగే కొనసాగితే 20 రోజుల్లో శ్రీశైలం ఖాళీ అవుతుందని, నాగార్జునసాగర్ చివరి ఆయకట్టు వరకూ సాగునీరు అందేలా పోరాటాలు కొనసాగించాలని తెలిపారు. జలవనరుల శాఖ నుంచి కోర్టు వరకు అన్ని అవకాశాలను వినియోగించుకుంటూ రాయలసీమ ప్రాజెక్టులు, బనకచర్ల ప్రాజెక్టులను అడ్డుకోవాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ కూడా రాయలసీమ ఎత్తిపోతల పథకం ఆపాలని విజ్ఞప్తి చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం ఏడు మండలాలను ఎపికి కట్టబెట్టడం అన్యాయమన్నారు. బనకచర్ల ప్రాజెక్టుకు ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకునేది లేదని, తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేసిన తర్వాత, వరద జిల్లాలో మన హక్కు తేలిన తర్వాతే కింది రాష్ట్రాలు ప్రాజెక్టుల గురించి ఆలోచించాలని అన్నారు.

జవహర్ ఎత్తిపోతల పథకం ఏడాదిలో పూర్తి : మంత్రి ఉత్తమ్

మధిర ప్రాంతానికి గేమ్ చేంజర్‌గా జవహర్ ఎత్తిపోతల పథకం ఉంటుందని చెప్పారు. రూ.630 కోట్లతో చేపట్టిన ఈ ఎత్తిపోతల పథకం పనులను ఏడాదిలోపు పూర్తి చేయాలని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ ఎత్తిపోతల పథకం ద్వారా 33 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని, వైరా నదిలో 120 రోజుల్లో 4 టిఎంసిలు ఎత్తిపోసేలా ఈ ప్రాజెక్టు రూపకల్పన చేశామని, దీని నిర్మాణానికి 190 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉంటుందని, దీనికోసం ప్రత్యేకంగా రూ.45 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు పుష్కలంగా గోదావరి జలాలు తీసుకొని వస్తామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టుకు తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకంగా పనిచేస్తుందని, గోదావరి నది బోర్డు నుంచి సిడబ్ల్యుసి వరకు ప్రతి దశలో ఆ ప్రాజెక్టును అడ్డుకుంటామని స్పష్టంచేశారు. గత పాలకుల అవినీతి కారణంగానే కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని జస్టిస్ కమిషన్ రిపోర్ట్ అందించిందని అన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. దిండి, సీతారామ, పాలమూరు, దేవాదుల ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. రూ.1200 కోట్లతో ఆర్అండ్‌బి రోడ్ల నిర్మాణం చేపట్టామని, వంగవీడుకు డబుల్ రోడ్ వేస్తామని తెలిపారు.

గోదావరి, కృష్ణా నీటితో జిల్లా సస్యశ్యామలం : మంత్రి పొంగులేటి

గోదావరి నీటిని పాలేరుకు తీసుకొచ్చి కృష్ణా నది పరివాహక ప్రాంతంలో ఉన్న 33 వేల ఎకరాల్లో రెండు పంటలు పండేలా సస్యశ్యామలం చేసేందుకు జవహర్ ఎత్తిపోతల పథకం ఉపయోగపడుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ పథకం ద్వారా ఆంధ్రాతో సంబంధం లేకుండా జోన్ 3 ఆయకట్టు జోన్ 2 పరిధిలోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాకాటి శ్రీహరి మాట్లాడుతూ.. తక్కువ ఖర్చుతో 33 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ చేసే దిశగా జవహర్ ఎత్తిపోతల పథకం ప్రభుత్వం నిర్మిస్తున్నదని అన్నారు. ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర రావు, ఇరిగేషన్ సిఇ రమేష్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా.. 13న దేశవ్యాప్తంగా ఆందోళనలు

- సిపిఎం నాయకులు బి వెంకట్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రజా సంపదను, సహజ వనరులను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతూ దేశంలో పేదరికం, నిరుద్యోగం పెరిగే విధంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా ఈనెల 13న దేశవ్యాప్తంగా చేపట్టే ఆందోళనలో ప్రజలంతా పాల్గొనాలని సిపిఎం కేంద్ర నాయకులు బి వెంకట్ పిలుపునిచ్చారు. అన్ని వర్గాల ప్రజలు క్విట్ కార్పొరేట్ పేరుతో ఆందోళనలకు పిలుపునిచ్చినట్టు తెలిపారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెంకట్ మాట్లాడారు. అమెరికా విధిస్తున్న అదనపు సుంకాలతో దేశీయ ఉత్పత్తులు దెబ్బతిని నిరుద్యోగం పెరగడానికి కారణమవుతుందని అన్నారు. అయినా అమెరికా అధ్యక్షులు ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా ప్రధాని నరేంద్ర మోడీ.. ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం దారుణమన్నారు. దేశీయ కార్పొరేట్ కంపెనీలు వారి ప్రయోజనాల కోసం అమెరికన్ కార్పొరేట్ కంపెనీలతో మిలాఖత్ కావడంతో దేశీయ ప్రయోజనాలు, ప్రజల ప్రయోజనాలు దెబ్బతింటాయని విమర్శించారు. ప్రధాని మోడీ పార్లమెంటులో ట్రంపు వ్యాఖ్యలను ఖండించాలని డిమాండ్ చేశారు. అమెరికా వేసిన పన్నులకు వ్యతిరేకంగా పోరాటానికి సిద్ధం కావాలన్నారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్, జిల్లా కార్యదర్శి ఎ రమేష్‌బాబు, కార్యదర్శివర్గ సభ్యులు నూర్జహాన్, నగర నాయకులు కటారి రాములు పాల్గొన్నారు. అనంతరం నాగారంలో నిర్వహించిన పెద్ది విజయదుర్గ సంస్మరణ సభలో పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ఇంజనీరింగ్‌లో మిగిలిన సీట్లు 11,638

- ఎప్‌సెట్ తుది విడతలో 80,011 మందికి సీట్ల కేటాయింపు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎప్‌సెట్ తుది విడత కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా ఆదివారం సాంకేతిక విద్యాశాఖ సీట్లు కేటాయించింది. ఈ మేరకు ఎప్‌సెట్ ప్రవేశాల కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎప్‌సెట్ ధ్రువపత్రాల పరిశీలనకు 97,369 మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. తుదివిడతలో 40,837 మంది అభ్యర్థులు వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలో 180 ఇంజినీరింగ్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలో 91,649 సీట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఎప్‌సెట్ తుది విడతలో 80,011 (87.3 శాతం) మందికి సీట్లు కేటాయించామని తెలిపారు. తుది విడతలో కొత్తగా 4,720 మందికి సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. 20,028 మంది స్లైడింగ్ చేసుకున్నారని వివరించారు. ఎప్‌సెట్‌లో ఇంకా 11,638 (12.7 శాతం) మిగిలాయని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన తరగతులు (ఇడబ్ల్యుఎస్) కోటా కింద 6,085 మంది సీట్లు పొందారని పేర్కొన్నారు. ఐదు యూనివర్సిటీలు, 46 ప్రయివేటు కాలేజీలు కలిపి మొత్తం 51 ఇంజినీరింగ్ కాలేజీల్లో వంద శాతం సీట్లు భర్తీ అయ్యాయని తెలిపారు. వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేసేందుకు ఈనెల 12వ తేదీ వరకు గడువుందని పేర్కొన్నారు. కేటాయించిన కాలేజీలో జిరాక్స్ ప్రతులతోపాటు ఒరిజినల్ టీసీని ఇవ్వాలని కోరారు. సెల్ఫ్ రిపోర్టింగ్ చేయకుండా కాలేజీలో రిపోర్టు చేయకుంటే సీట్లు రద్దవుతాయని స్పష్టం చేశారు. ఈనెల 11 నుంచి 13 వరకు కేటాయించిన కాలేజీల్లో రిపోర్టు చేయాలని సూచించారు. ఈనెల 18,19 తేదీల్లో కేంద్రీకృత ఆన్‌లైన్ స్లైడింగ్ విధానం ఉంటుందని వివరించారు. ఆ కాలేజీలో బ్రాంచ్ మార్పు చేసుకునేందుకు అవకాశముందని తెలిపారు. ఆ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం వర్తిస్తుందని ఇతర వివరాల కోసం https://tgeapcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

సిఎస్ఇ, ఐటి అనుబంధ కోర్సుల్లో మిగిలిన సీట్లు 5,261

కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సిఎస్ఇ), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) అనుబంధ కోర్సులకు భారీగా ఆదరణ ఉన్నది. ఆయా కోర్సుల్లో చేరేందుకు ఎక్కువ మంది అభ్యర్థులు ఆసక్తి చూపుతున్నారు. సిఎస్ఇ, ఐటి అనుబంధ కోర్సుల్లో 65,080 సీట్లుంటే, 59,819 (91.92 శాతం) మందికి సీట్లు కేటాయించారు. ఇంకా 5,261 సీట్లు మిగిలాయి. ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ కోర్సుల్లో 17,754 సీట్లకుగాను 14,118 (79.52 శాతం) సీట్లు భర్తీ అయ్యాయి. ఇంకా 3,636 సీట్లు మిగిలాయి. సివిల్, మెకానికల్ అనుబంధ కోర్సుల్లో 7,675 సీట్లుంటే, 5,236 (68.22 శాతం) మందికి సీట్లు కేటాయించారు. ఇంకా 2,439 సీట్లు మిగిలిపోయాయి. ఇతర ఇంజనీరింగ్ కోర్సుల్లో 1,140 సీట్లుంటే, 838 (73.51 శాతం) సీట్లు భర్తీ అయ్యాయి. ఇంకా 302 సీట్లు మిగిలాయి.

సిఎం రేవంత్‌తో మంత్రి తుమ్మల భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వ్యవసాయ శాఖ సంబంధిత సమస్యలపై చర్చించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఆ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భేటీ అయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని సిఎం నివాసంలో కలిశారు. వానాకాలం సీజన్‌లో తలెత్తే సమస్యలు, యూరియా సరఫరా విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం తదితరాంశాలపై చర్చించారు. ఆగస్టు 4న జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో వ్యవసాయ శాఖపై జరిగిన చర్చ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించాలని సిఎంను తుమ్మల కోరారు. వాటిపై చర్చించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని సిఎం హామీ ఇచ్చారు.

నేటి నుంచి హాస్టళ్లలో పప్పు చారేనా ?

- కూరగాయలు, పండ్లు, చికెన్, మటన్, గుడ్లు సరఫరా నిలిపివేత
- సంక్షేమ హాస్టళ్ల టెండర్ కార్పొరేట్‌కు అప్పగించే కుట్ర
- పాత విధానం కొనసాగించాలని, బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 300 హాస్టళ్లలో వేలాది విద్యార్థుల భోజనానికి ఎసరు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జిల్లా సంక్షేమ హాస్టళ్లకు సోమవారం నుంచి కూరగాయలు, పండ్లు, చికెన్, మటన్, కోడిగుడ్ల సరఫరా నిలిచిపోనుంది. కొత్త టెండర్ విధానంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సప్లయ్‌దారులు, తమ డిమాండ్లను పరిష్కరించకపోతే సరఫరా నిలిపివేస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు, జోనల్ ఆఫీసర్, డిసిఒ పాయింట్ ఆల్ స్కూల్స్ ప్రిన్సిపాల్స్‌కు వినతిపత్రం అందజేశారు. 25 సంవత్సరాలుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 300పైగా హాస్టళ్లకు ఆహార సరుకులు సరఫరా చేస్తున్న సప్లయ్‌దారులు, ఈసారి ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త టెండర్ విధానం తమకు ఆర్థికంగా ముప్పు కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక ఇఎండి, కఠినమైన షరతులు, తక్కువ సరఫరా సమయాలు, కోడిగుడ్ల సరఫరా విధానంలో మార్పులు తమ సామర్థ్యానికి మించి ఉన్నాయన్నారు. ఇప్పటికే నాలుగు నెలలుగా సరఫరా చేసిన బిల్లులు చెల్లించకపోవడంతో అప్పుల బారిన పడ్డామని గోడు వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఆదివారం 70శాతం హాస్టళ్లకు చికెన్ సరఫరా కాలేదని సమాచారం.

కొత్త టెండర్ విధానంతో జీవనోపాధికి ఎసరంటున్న సప్లయ్‌దారులు

'కొత్త టెండర్ విధానం అమలయితే వందలాది కుటుంబాలు జీవనోపాధి కోల్పోయే పరిస్థితి వస్తుంది. పాత విధానాన్ని కొనసాగించకపోతే, 11ఆగస్టు నుంచి కూరగాయలు, పండ్లు, చికెన్, మటన్, కోడిగుడ్ల సరఫరా నిలిపివేస్తాం' అని సప్లయ్‌దారులు హెచ్చరించారు. అలాగే, మెను ప్రకారం సరుకులు కావాలంటే మార్కెట్ రేట్ల ప్రకారం ధరలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నాలుగు నెలలుగా సరఫరా చేసిన సరుకుల బిల్లులు ఇప్పటికీ చెల్లించకపోవడంతో ఇప్పటికే అప్పుల భారంలో ఉన్నామని, ఇప్పుడు కొత్త టెండర్ విధానంలో అధిక ఈఎండీ, మార్పు చేసిన నిబంధనలు, సరఫరా సమయాలపై కఠిన నియంత్రణలు తమ సామర్థ్యానికి మించి ఉన్నాయని చెప్పారు. పాత విధానంలో ఉన్న అనువైన నిబంధనలు రద్దు చేయడంతో, తక్కువ మూలధనంతో పనిచేసే సరఫరాదారులు టెండర్‌లో పాల్గొనే అవకాశం కోల్పోతున్నారని తెలిపారు.

పౌష్టికాహారం అందేనా..

ఈ నిర్ణయంతో హాస్టల్స్‌లో చదువుతున్న వేలాది విద్యార్థులు నేటి నుంచే పప్పుచారు, పరిమిత భోజనంతో గడపాల్సిన పరిస్థితి తలెత్తింది. తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం వెంటనే సమస్య పరిష్కరించకపోతే విద్యార్థుల ఆహార నాణ్యత దెబ్బతింటుందని హెచ్చరిస్తున్నారు. ఈ సరఫరా వ్యవస్థపై ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక మంది రైతులు, చిన్న వ్యాపారులు ఆధారపడి జీవిస్తున్నారు. సరఫరా నిలిపివేతతో వీరి జీవనోపాధి కూడా ప్రమాదంలో పడనుంది.

అధికారులపై అందరి చూపు

సమస్య పరిష్కారానికి ప్రభుత్వం, అధికారులు వెంటనే ముందుకొచ్చి నిర్ణయం తీసుకోవాలంటూ సరఫరా దారులు, తల్లిదండ్రులు, రైతులు కోరుతున్నారు. లేకపోతే హాస్టల్స్‌లో ఆహార సంక్షోభం మరింత తీవ్రమవుతుందని హెచ్చరిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వంగా చెప్పుకుంటూనే కార్పొరేట్ శక్తులకు టెండర్లు అప్పజెప్పేలా నిర్ణయాలు ఉన్నాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

టైర్-2 పట్టణాలకు ఐటిని విస్తరించడం హర్షణీయం : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కెసిఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణలోని టైర్-2 పట్టణాలకు ఐటీ పరిశ్రమను విస్తరించామనీ, ఆ సంకల్పాన్ని కాంగ్రెస్ కొనసాగించడం హర్షణీయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎక్స్ వేదికగా తెలిపారు. "తాము అధికారంలో ఉన్నప్పుడు నల్లగొండ, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, ఖమ్మం, సిద్ధిపేటలలో ఐటీ హబ్‌లను ఏర్పాటు చేశాం. ఇప్పుడు ఆదిలాబాద్ కూడా ఆ జాబితాలోకి చేరింది. చిన్న, మధ్య తరహా ఐటీ కంపెనీల కోసం అవసరమైన సదుపాయాలు కల్పించడం, స్టార్టప్‌లను ప్రోత్సహించడం, టాస్క్ సెంటర్లతో యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వడం ఈ ఐటీ హబ్‌ల ప్రధాన ఉద్దేశ్యం. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆ సంకల్పాన్ని కొనసాగిచడం మంచి పరిణామం" అని కేటీఆర్ పేర్కొన్నారు.

పిఆర్‌టియు తెలంగాణ అధ్యక్షులుగా చంద్రయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పిఆర్‌టియు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా మన్నె చంద్రయ్య, అసోసియేట్ అధ్యక్షులుగా రావులకార్ వెంకటేశ్ ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆ సంఘం కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని పిఆర్‌టియు తెలంగాణ ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ అబ్దుల్లా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల అధికారిగా పి వెంకట్‌రెడ్డి వ్యవహరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక కార్యదర్శి పులి దేవేందర్, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అహేతుక అంశాలతో పాఠ్యాంశాలు

- న్యూ ఎడ్యుకేషన్ పాలసీ దేశానికి అత్యంత ప్రమాదం
- కరోనా ముందు నుంచి 1800కు పైగా అంశాలు మార్పు
- బివికె 20వ వార్షికోత్సవ సెమినార్‌లో ప్రముఖ కవి ప్రొ. దేవరాజు మహారాజు
- ట్రంప్, మోడీ ఫ్రెండ్సయితే 50 శాతం సుంకాలెందుకు? : తమ్మినేని



సావనీర్ ఆవిష్కరిస్తున్న ప్రొ దేవరాజు మహారాజు, తమ్మినేని వీరభద్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నూతన విద్యావిధానం దేశానికి అత్యంత ప్రమాదమని, బిజెపి అధికారంలోకి వచ్చాక కోవిడ్ ముందు నుంచి ఇప్పటికీ 1800కు పైగా అంశాలను మార్చిందని జీవశాస్త్ర ప్రొఫెసర్, కవి, రచయిత దేవరాజు మహారాజు అన్నారు. మానవశక్తి స్థానంలో దైవశక్తిని చొప్పించి అజ్ఞానం వైపు విద్యావిధానాన్ని తీసుకెళ్లే ప్రయత్నాలు కొనసాగుతున్నాయన్నారు. బోడేపూడి విజ్ఞాన కేంద్రం (బివికె) 20వ వార్షికోత్సవం సందర్భంగా బోడేపూడి స్మారకోపన్యాసం, సావనీర్ ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా 'సైన్స్, చరిత్ర పాఠ్యాంశాల మార్పు'పై ఖమ్మంనగరంలోని మంచికంటి భవన్‌లో బివికె ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎంపి తమ్మినేని వీరభద్రం అధ్యక్షతన ఆదివారం ఏర్పాటు చేసిన సెమినార్‌లో దేవరాజు మహారాజ్ మాట్లాడారు. బోడేపూడి జనంతో మమేకమై జీవించేవారని తెలుసుకున్నానని చెప్పారు. పాఠ్యాంశాల మార్పువల్ల భావిభారత పౌరులకు తీరని ప్రమాదమని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం 1,800కు పైగా సహేతుకమైన అంశాలను మార్చి అహేతుకమైన అంశాలను జోడించారని తెలిపారు. ఎప్పటి నుంచో ఉన్న జాతీయ విద్యావిధానాన్ని మార్చి అసంబద్ధమైన, అవాస్తవాలతో కూడిన న్యూ ఎడ్యుకేషన్ పాలసీ-2020ని తీసుకొచ్చారని తెలిపారు. జీవపరిణామక్రమ సిద్ధాంతాన్నే మార్చివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మానవజాతి ఈ భూమి మీదకు ఎలా వచ్చిందనేది తెలుసుకోకుండా జీవపరిణామక్రమాన్ని సిలబస్ నుంచి తీసివేయాలనుకోవటం అవివేకం అని అన్నారు. సహజ వనరుల పుట్టుక దైవశక్తి నుంచి ఉద్భవించిందని చెప్పటం మరో లోపమన్నారు. జీవులన్నీ ఒకదానిపై ఒకటి ఆధారపడి జీవించాల్సిందేనని తెలిపారు. ఇటువంటి చరిత్ర, జీవశాస్త్రాలతో కూడిన బయోడైవర్సిటీ అంశాల్ని పాఠ్యాంశాల్లో నుంచి తొలగించి, అభూతకల్పనలతో కూడిన అంశాలను చొప్పిస్తున్నారని చెప్పారు. కుంభమేళాల గురించి పాఠ్యాంశాలు పెట్టడం ఎందుకని ప్రశ్నించారు. బీజేపీ.. ఈ దేశాన్ని హిందూ రాష్ట్రంగా మార్చాలని చూస్తున్నదని, హిందూ రాష్ట్రమనేది చరిత్రలో లేదని అన్నారు. అశోకుని కాలంలో మనదేశం బౌద్ధం, ఆ తర్వాత సువిశాలమైన దేశాన్ని మొగలులు స్థాపించారని తెలిపారు. హిందూ అనేది భౌగోళిక పదం మాత్రమేనని, మతానికి సంబంధించింది కాదని స్పష్టంచేశారు. శివాజీ ఆస్థానంలో 40శాతం మంది అధికారులు ముస్లింలు, ఔరంగాజేబు ఆస్థానంలో అత్యధిక పాలకులు హిందువులని గుర్తుంచుకోవాలన్నారు. వైజ్ఞానిక అంశాల గురించి లోతైన అధ్యయనం జరిగిందని, కానీ వాటినికాదని మతపరమైన, అశాస్త్రీయమైన అంశాలను పాఠ్యాంశాల్లో చొప్పించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు.

భారత్‌పై 50శాతం పన్నులపై స్పందించరేంటి? : తమ్మినేని

అమెరికా అధ్యక్షులు ట్రంప్, మోడీ ఫ్రండ్స్ అయినప్పుడు మనదేశ ఉత్పత్తులపై అమెరికా 50 శాతం దిగుమతి సుంకాన్ని విధించిస్తే ప్రధాని ఎందుకు స్పందించటం లేదని మాజీ ఎంపి తమ్మినేని వీరభద్రం ప్రశ్నించారు. సిపిఎం శాసనసభ పక్ష నేతగా, పార్టీ కార్యదర్శివర్గ సభ్యులుగా బోడేపూడి వెంకటేశ్వరరావు అందించిన సేవలను గుర్తు చేశారు. రాజకీయాల్లో అయన ఎన్నడూ రాజీపడలేదన్నారు. చిర్రావూరి లక్ష్మీనారాయణ, మంచికంటి, ఏలూరి లక్ష్మీనారాయణ, బోడేపూడి కార్యాచరణ ఆదర్శనీయమన్నారు. ఏ రైతాంగం కోసమైతే బోడేపూడి వంటివారు పాటుపడ్డారో అమెరికా అధ్యక్షులు ట్రంప్ చర్యల వల్ల ఇప్పుడు ఆ రైతులే సంక్షోభంలో పడ్డారని తెలిపారు. పాకిస్తాన్‌పై 19శాతం, కొన్నిదేశాలపై 10, 15శాతం దిగుమతి సుంకాలు మాత్రమే వేసి భారత్‌పై పెద్దమొత్తం పన్ను వేశారని విమర్శించారు. ప్రపంచశాంతి నోబెల్ బహుమతి ఇవ్వాలని ట్రంప్ తనకు తానుగా ప్రకటించుకోవటం హాస్యాస్పదం అన్నారు. భారతీయ వ్యవసాయరంగాన్ని ఖతం చేయటమే ట్రంప్ లక్ష్యమని తెలిపారు. అమెరికా ఆగడాలను అడ్డుకోకపోతే దేశం సర్వనాశనం అవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బివికె ట్రస్ట్ జనరల్ మేనేజర్ వై.శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ పోతినేని సుదర్శన్, ప్రధాన కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సిఐటియు జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు, బివికె మాజీ జీఎంలు సీహెచ్ రాజారావు, కె శ్రీనివాస్, సత్యసాయి సేవ సమితి బాధ్యులు డి.సుధాకర్, ట్రస్ట్ సభ్యులు వాసిరెడ్డి వీరభద్రం, తుమ్మల వెంకట్రావు, గోవిందరావు, ఎస్‌కె ఎండి జాన్, ఎస్‌కె అఫ్జల్, ఎస్ నాగేశ్వరరావు, ఎం సుబ్బారావు, పొన్నం వెంకటేశ్వరరావు, బుగ్గవీటి సరళ తదితరులు పాల్గొన్నారు.

డెంగీతో విద్యార్థి మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డెంగీతో ఓ విద్యార్థి మృతిచెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా జోగిపేటలో ఆదివారం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జోగిపేట పట్టణానికి చెందిన కుమ్మరి మధుమతి, భాస్కర్ దంపతుల రెండవ కూతురు యశస్విని (12)కి ఆరు రోజుల క్రితం జ్వరం రావడంతో జోగిపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్సలు చేయించారు. మూడు రోజులు చికిత్స పొందినా జ్వరం తగ్గకపోవడంతో సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ రెండ్రోజులు చికిత్స పొందిన తర్వాత యశస్వినికి వైద్య పరీక్షలు నిర్వహించగా డెంగీ అని తేలింది. శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉండటంతో బాలికను నీలోఫర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం ఉదయం మృతిచెందింది. కాగా, యశస్విని జోగిపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతుంది. పరిసరాలు పరిశుభ్రంగా లేవని, ఇంటి చుట్టూ గడ్డి ఎక్కువగా పెరగడంతో దోమలు విలయ తాండవం చేస్తున్నాయని మున్సిపల్ కమిషనర్‌కు చెప్పినా పట్టించుకోలేదని మృతురాలి తండ్రి భాస్కర్ ఆరోపించారు.

సింగరేణిని కాంగ్రెస్ కరప్షన్ గనిగా మార్చింది

దసరా తర్వాత హెచ్‌ఎంఎస్‌తో కలిసి యాత్ర : కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సింగరేణి సంస్థను కాంగ్రెస్ పార్టీ కరప్షన్ గనిగా మార్చిందని తెలంగాణ జాగృతి అధ్యక్షులు, ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో గల జాగృతి కార్యాలయంలో హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్‌తో చర్చలు జరిపారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఉద్యోగ నియామకాలతో సహా అన్నింట్లో కాంగ్రెస్ పార్టీ అవినీతికి పాల్పడుతోందని ఆరోపించారు. జైపూర్ థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణ అంచనా వ్యయాలను రాత్రికి రాత్రే అమాంతం పెంచారని విమర్శించారు.

సంస్థను కాపాడుకోవాలన్న ఉద్దేశంతో కెసిఆర్ సింగరేణిలో రాజకీయ అవినీతిని అంతం చేశారనీ, కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతి మరింత పెరిగిందని ఆరోపించారు. సింగరేణి సంస్థను కేంద్ర విజిలెన్స్, సిబిఐ పరిధిలోకి మార్చాలని డిమాండ్ చేశారు. కార్మికులకు భరోసా ఇవ్వడానికి ఎచ్‌ఎంఎస్‌తో కలిసి త్వరలో సింగరేణి యాత్ర చేపడుతామని ప్రకటించారు. కార్మికుల హక్కుల విషయంలో కాంగ్రెస్ పార్టీ మోసాలను ఎండగడుతామని స్పష్టం చేశారు. బోనస్ విషయంలో కార్మికులను ఆ పార్టీ నయవంచనకు గురి చేసిందని ఆరోపించారు. లాభాల్లో 33 శాతం వాటా బోనస్‌గా ఇస్తున్నామని చెప్పి... లాభాలనే తక్కువ చేసి చూపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి కార్మికులకు ఈ ఏడాది దసరా బోనస్ లాభాల్లో 37 శాతం వాటా ఇవ్వాలని కోరారు. సంస్థ ఉద్యోగులపై విధిస్తున్న ఆదాయపు పన్ను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. 22 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులకు హైలేవల్ కమిటీ చేసిన సిఫారసుల మేరకు వేతనాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న వక్త

ఎస్‌టిఎఫ్‌ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా

సిఎన్ భారతి, చావ రవి

- జనరల్ కౌన్సిల్ సభ్యులుగా 87 మంది ఎంపిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిఎఫ్ఐ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా సిఎన్ భారతి (హర్యానా) చావ రవి (తెలంగాణ) ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కత్తాలో జరిగిన రజతోత్సవ మహాసభల మూడోరోజు ముగింపులో సభలో సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వారితో పాటు 87 మంది జనరల్ కౌన్సిల్ సభ్యులుగా, 45 మందిమంది కేంద్ర కమిటీ సభ్యులుగా, 23 ఆఫీస్ బేరర్లుగా ఎన్నికయ్యారు. తెలంగాణ నుంచి కేంద్ర కమిటీలో మహిళా ప్రతినిధిగా సిహెచ్ దుర్గా భవాని, జనరల్ కౌన్సిల్ సభ్యులుగా ఎ వెంకట్, ఆర్ శారదలకు స్థానం దక్కింది. వారు మూడు సంవత్సరాల పాటు ఆ బాధ్యతల్లో కొనసాగుతారు. విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు దేశవ్యాప్తంగా నాలుగు దశల పోరాట కార్యక్రమానికి మహాసభ పిలుపునిచ్చింది. మొదటి దశలో మండల కేంద్రాల్లో, రెండవ దశలో జిల్లా కేంద్రాల్లో, మూడోదశలో రాష్ట్ర కేంద్రంలో, నాలుగో దశలో దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించాలని మహాసభ నిర్ణయించింది. ఈ దశల వారి పోరాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మహాసభ విజ్ఞప్తి చేసింది.

మహాసభ ఆమోదించిన తీర్మానాలు

(1). సిపిఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ (ఒపిసి) పునరుద్ధరించాలి. పిఎఫ్ఆర్‌డిఎ చట్టం రద్దు చేయాలి.

(2).ఆదాయపు పన్ను పరిమితిని సవరించి, ఉద్యోగులపై భారాన్ని తగ్గించాలి.

3).ఎన్ఇపి- 2020 రద్దు చేసి ప్రత్యామ్నాయ జాతీయ విద్యా విధానం తీసుకు రావాలి.

(4).విద్యా కేంద్రీకరణను ఆపాలి, పాఠశాలల మూసేత, సిలబస్ తొలగింపును నిలిపివేయాలి.

(5).విద్యారంగానికి జిడిపిలో ఆరు శాతం, కేంద్ర బడ్జెట్లో పది శాతం నిధులు కేటాయించాలి.

(6).ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలి.

(7).కాంట్రాక్ట్ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి, బేసిక్ పే కల్పించాలి.

(8).ఉపాధ్యాయ ఖాళీలను రెగ్యులర్ ప్రాతిపదికన భర్తీ చేయాలి.

(9).కాంట్రాక్టు, గెస్ట్, అవర్ బేస్డ్, అవుట్ సోర్సింగ్ లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను రెగ్యులరైజ్ చేయాలి.

(10) ఉపాధ్యాయులకు బోధనేతర పనులు ఇవ్వకుండా బోధనకే పరిమితం చేయాలి. తదితర 21 తీర్మానాలను మహాసభ ఆమోదించింది.

చావ రవి ఎన్నిక పట్ల హర్షం

సుదీర్ఘ కాలంగా జాతీయ స్థాయి ఉపాధ్యాయ ఉద్యమంలో చురుగ్గా పాల్గొంటున్న చావ రవి ఎస్‌టిఎఫ్ఐ ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక కావడం పట్ల తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్‌యుటిఎఫ్) హర్షం వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్, ఉపాధ్యక్షులు సిహెచ్ దుర్గ భవాని, కోశాధికారి టి లక్ష్మారెడ్డి, కార్యదర్శులు శాంతి కుమారి, నాగమణి, రాజు, రంజిత్ కుమార్, సత్యానంద్, మల్లారెడ్డి, శ్రీధర్, రవి ప్రసాద్ గౌడ్, రవికుమార్, సింహాచలం, జ్ఞాన మంజరి, వెంకటప్ప తదితరులు అభినందనలు తెలిపారు.

కొత్తగూడ అడవుల్లో పెద్దపులి సంచారం

- బోన్లు ఏర్పాటు చేసిన అటవీశాఖ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచారం కలకలం రేపింది. కొత్తగూడ మండలం రాంపురం గ్రామంలో పెద్దపులి ఆవును చంపి తిన్నట్టు ఆనవాళ్లు గుర్తించారు. దాంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పులి పాదముద్రలు గుర్తించిన అటవీ అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. వ్యవసాయ పనులు, పశువుల మేత కోసం అడవికి వెళ్లొద్దని, సాయంత్రం ఆరు తర్వాత ఇల్లు వదిలి బయటకు రావొద్దని హెచ్చరించారు.

రాంపూర్, పోనుగొండ్ల, ఉటాయి గ్రామాల్లో పులి సంచరిస్తున్నట్టు అటవీ అధికారులు గుర్తించారు. సమీప అటవీ ప్రాంతంలో పులిని పట్టుకోవడానికి బోన్లు ఏర్పాటు చేశారు. పులికి ఎలాంటి హాని కలిగించొద్దని, పొలాల చుట్టూ విద్యుత్ తీగలు ఏర్పాటు చేయొద్దని అటవీ అధికారి ఆదేశించారు. పాదముద్రల ద్వారా మగ పులి సంచరిస్తున్నట్టు గుర్తించారు. రెండేండ్ల కిందట ఒకసారి కొత్తగూడ అడవుల్లో పులి సంచారం కనిపించింది. మళ్లీ ఇప్పుడు పులి మరోసారి కనిపించడం కలకలం రేపుతోంది.

కలిసి పని చేయండి

- కొండా మురళికి కమిటీ చైర్మన్ మల్లు రవి సూచన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజాప్రతినిధులపై మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన పిసిసి క్రమశిక్షణ కమిటీ ముందు హాజరై వివరణ ఇచ్చారు. ఇంతకు ముందు కూడా ఆయన వివరణ ఇచ్చినపప్పటికీ కమిటీ సంతృప్తి చెందలేదు. రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలంటూ సూచించింది. ఈ క్రమంలో ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో రెండోసారి కమిటీ ముందు హాజరయ్యారు. దాదాపు రెండుగంటలపాటు సమావేశం జరిగింది. అనంతరం ఆ కమిటీ చైర్మన్ మల్లు రవి మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలపై చర్చించినట్టు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలతోపాటు అన్ని కార్యక్రమాల్లో కలిసి పని చేసేందుకు మురళి ఒప్పుకున్నారని చెప్పారు. ఎమ్మెల్యేలు అనిరుద్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిలపై చర్చ జరగలేదని చెప్పారు. వారి విషయాలను తమ దృష్టికి రాలేదన్నారు. కొండా మురళి మాట్లాడుతూ రాహుల్‌గాంధీని ప్రధాని చేయడమే తమ లక్ష్యమని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసి పని చేయాలంటూ చైర్మన్ సూచనను పాటిస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేస్తానని హామీ ఇచ్చారు.

బిసి రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్న

బిజెపిని గద్దెదించాలి

- బీహార్‌లో నకిలీ ఓట్లతో అధికారంలోకి వచ్చేందుకు బిజెపి ప్రయత్నం : జాన్‌వెస్లీ



సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలును చట్టబద్ధం చేయకుండా దానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని గద్దెదించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి జహంగీర్, మల్లు లక్ష్మి, రాష్ట్ర నాయకులు జి.రాములుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో అధికారంలో ఉన్న బిజెపి బిసిలకు 42 శాతం రిజర్వేషన్లపై పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించకుండా నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో బిజెపి నుంచి గెలిచిన ఎనిమిది మంది ఎంపిలు పార్లమెంట్‌లో దీనిపై నోరు మెదకపోవడం దారుణమన్నారు. పైగా బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేదిలేదంటూ కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. వెంటనే బిసిలకు బండి సంజయ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీహార్‌లో జరుగుతున్న ఎన్నికల్లో పెద్దఎత్తున నకిలీ ఓటర్లను సృష్టించి అధికారంలోకి వచ్చేందుకు బీజేపీ నాయకులు రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నారని, ఇది దేశ సార్వభౌమత్వానికి వ్యతిరేకమని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ జహంగీర్, మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. మనువాద భావాజాలాన్ని ముందుకు తీసుకొచ్చి భారత రాజ్యాంగాన్ని సమూలంగా మార్చే కుట్రలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి అధికారంలో ఉన్న అనేక రాష్ట్రాల్లో దళితులు, గిరిజనులు, మైనార్టీలపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతుందని విమర్శించారు. దేశంలో రిజర్వేషన్లు లేకుండా చేయాలని కుట్ర చేస్తున్న బిజెపి విధానాలపై పోరాడేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు స్కైలాబ్‌బాబు, కొండమడుగు నర్సింహ, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేశ్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జిల్లెల పెంటయ్య, జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యలపై సిఎం చొరవ చూపాలి

- టిఆర్‌టిఎఫ్ రాష్ట్ర కార్యవర్గం డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ చూపి వాటిని పరిష్కరించాలని టిఆర్‌టిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం డిమాండ్ చేసింది. ఆదివారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కటకం రమేష్, ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి మాట్లాడుతూ మంత్రివర్గ ఉపసంఘం, అధికారుల కమిటీని సిఎం రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేసినా సమస్యలు పరిష్కారం కాలేదని చెప్పారు. సిఎం చొరవ తీసుకుని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్థికపరమైన సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. కానీ ఆర్థికేతర సమస్యలు కూడా పెండింగ్‌లోనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాటి పరిష్కారం కోసం ఉత్తర్వులను జారీ చేయాలని కోరారు. సిపిఎస్, యుపిఎస్‌ను రద్దు చేయాలని, ఒపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డిఎలను విడుదల చేయాలని సూచించారు. పిఆర్‌సిని అమలు చేయాలన్నారు. నగదు రహిత వైద్య చికిత్సను అందించాలనీ, ఉద్యోగుల నుంచి కాంట్రిబ్యూషన్‌ను తీసుకోవాలని కోరారు. 317 జిఒ బాధిత ఉద్యోగులకు న్యాయం చేయాలని చెప్పారు. బిఎడ్ అర్హత ఉన్న ఎస్‌జిటిలకు పిఎస్‌హెచ్‌ఎం పదోన్నతులను కల్పించాలని అన్నారు. ఏకీకృత సర్వీసు నిబంధనలను అమలు చేయాలన్నారు. డిఎస్‌సి-2003 ఉపాధ్యాయులకు పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయపరమైన చిక్కుల్లేకుండా విద్యాశాఖ ఉత్తర్వులను జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఆర్‌టిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కావలి అశోక్‌కుమార్, సుంకిశాల ప్రభాకర్‌రావు, గోవర్ధన్, కోలరాజు నాయక్, మహేందర్‌రాజు, రణధీర్‌తోపాటు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



గోనె సంచుల గోదాములో భారీ అగ్నిప్రమాదం

- లక్షల విలువైన సంచులు కాలి బూడిద

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో గోనె సంచులు నిల్వ చేసిన గోదాంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఆదివారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో గోదాం పైభాగం నుంచి పొగలు రావడం గమనించిన స్థానికులు.. పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దాంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ మంటలు అదుపులోకి రాకపోవడంతో జగిత్యాల, నిర్మల్ జిల్లాల నుంచి మరో రెండు అగ్నిమాపక యంత్రాలను రప్పించారు. మూడు ఫైర్ ఇంజన్ల సాయంతో మంటలను అదుపు చేసేందుకు సిబ్బంది తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. సాయంత్రం వరకూ మంటలు అదుపులోకి రాకపోవడంతో జెసిబి సాయంతో గోదాము గోడలను కూల్చివేసి లోపలున్న గోనె సంచులను బయటకు తెస్తున్నారు. ప్రమాదం జరిగే సమయానికి గోదాంలో తొమ్మిది లక్షలకుపైగా గోనె సంచులు ఉన్నాయని అధికారులు తెలిపారు. వాటిలో సుమారు రెండు నుంచి మూడు లక్షల వరకు కాలిపోయి ఉండొచ్చని అంచనా వేశారు. మంటలు అదుపులోకి రాకపోవడంతో ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. కాలిపోయిన గోనె సంచుల విలువ సుమారు రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు ఉండవచ్చని జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్ జితేంద్ర ప్రసాద్ అంచనా వేశారు. కాగా, ప్రమాదానికి గల కారణాలపై అధికారులు ఓ అంచనాకు రాలేకపోతున్నారు. గోదాంలో విద్యుత్ సౌకర్యం లేనందున పోలీసులు ఆకతాయిలు ఎవరైనా అంటించి ఉంటారా అనే కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదం జరిగిన గోదాం వద్ద మద్యం సేవించిన ఆనవాళ్లు ఉన్నందున పోలీసులు ఆ దిశలో విచారణ చేపడుతున్నారు.

ఉద్యోగోన్నతులకు అడ్డంకులు

- గతంలో జారీ చేసిన జిఒలతోనే ఇబ్బంది
- ప్రభుత్వ పురుష నర్సింగ్ ఆఫీసర్లలో ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నర్సింగ్ వృత్తిలోకి మహిళలతో పాటు పురుషులు వస్తున్నారు. నర్సింగ్ విద్యను అభ్యసించడంలోనూ, సేవలందించడంలోనూ మహిళలతో పురుషులున్నారు. అయితే మొదటి నుంచి ఈ వృత్తిలో మహిళలే అత్యధికంగా ఉండటంతో జారీ అయ్యే జిఒలు పురుషులకు సమాన అవకాశాలు రావడంలో ఇబ్బందికరంగా మారుతున్నాయి. 1980కి ముందు నర్సింగ్ విద్య, వృత్తిలో మహిళలు, పురుషులు ఉండేది. ఆ తర్వాత ఆ వృత్తిని కేవలం మహిళా అభ్యర్థులకే పరిమితం చేశారు. దీంతో నర్సింగ్ విద్య పట్ల ఆసక్తి కలిగిన పురుషులు తమకు అవకాశం కల్పించాలని కోరుతూ వచ్చారు. అదే సమయంలో రోగులకు సేవలందించే క్రమంలో పురుషులైన నర్సింగ్ ఆఫీసర్ల అవసరం కూడా ఉంటుందని ఆ మేరకు వారిని కూడా భాగస్వాములు చేయాలని నిపుణులు సూచించారు. 2005లో మొదటిసారిగా నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం నర్సింగ్ విద్యలో మహిళలతో పాటు కొంత శాతం మేరకు పురుషులు కూడా అభ్యసించేందుకు అవకాశం కల్పించింది. దీంతో 1980 తర్వాత ఆగిపోయిన పురుష అభ్యర్థుల నియామకం తిరిగి 2011లో నర్సింగ్ ఆఫీసర్ల పోస్టుల భర్తీ చేయడంతో మళ్లీ మొదలైంది. ఆ నియామకంలో పదుల సంఖ్యలో పురుషులు ప్రభుత్వ నర్సింగ్ ఆఫీసర్లుగా నియామకం అయ్యారు. ఆ తర్వాత 2021 నోటిఫికేషన్, 2024 నోటిఫికేషన్ సమయంలో వందల మంది పురుష అభ్యర్థులు ప్రభుత్వ నర్సింగ్ ఆఫీసర్లు అయ్యారు. గతంలో కార్మికశాఖ పరిధిలోని ఈఎస్ఐలో నర్సింగ్ ఆఫీసర్ల నియాకమం కోసం కేవలం "మహిళా అభ్యర్థులు మాత్రమే"అంటూ దరఖాస్తు చేసుకోవాలంటూ షరతుతో విధించింది. దీనిపై నర్సింగ్ విద్యను అభ్యసించిన పురుష అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించగా, నియామకాల్లో ఎలాంటి లింగ వివక్ష చూపించరాదని కోర్టు తీర్పునిచ్చిన విషయం విదితమే. వైద్యారోగ్యశాఖలో నియామకా ల్లో ఎలాంటి వివక్ష లేకుండా నోటిఫికేషన్ విడుదల చేస్తున్నారు. దాదాపు 15 సంవత్సరాలుగా విడుదలైన 3 నోటిఫికేషన్ల ద్వారా 1,000 నుంచి 1,200 మంది వరకు ప్రభుత్వ నర్సింగ్ ఆఫీసర్లు అయ్యారు. నర్సింగ్ ఆఫీసర్లుగా నియామకమైనప్పటికీ ఉద్యోగోన్నతుల సమయంలో గతంలో జారీ చేసిన జిఒలు అడ్డంకిగా మారుతున్నాయి. 2024లో కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లలో 214 లెక్చరర్ పోస్టుల భర్తీ కోసం సీనియార్టీ లిస్ట్ ను కేవలం మహిళా అభ్యర్థులతోనే విడుదల చేశారు. దీనిపై ప్రభుత్వ పురుష నర్సింగ్ ఆఫీసర్లు హైకోర్టును ఆశ్రయిం చారు. 1998 అక్టోబర్ 16న విడుదల చేసిన జీవో నెంబర్ 466, 1997 ఏప్రిల్ 4న విడుదల చేసిన జిఒ నెంబర్ 101లు ఉద్యోగోన్నతులకు "మహిళా అభ్యర్థులు మాత్రమే" అర్హులని నిర్దేశించడమే పురుషుల ఉద్యోగోన్నతులకు ప్రధాన ఆటంకంగా మారుతోంది.

సవరించిన ఆంధ్రప్రదేశ్

2014 సెప్టెంబర్ నాలుగున ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (హైదరాబాద్)లో జరిగిన విచారణలో జీవో నంబర్ 126లోని రూల్ నాలుగు(ఎ)ను సవాలు చేశారు. దీంతో ట్రిబ్యునల్ స్టాఫ్ నర్స్ పోస్టులను మహిళలకు మాత్రమే పరిమితం చేయడం భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 (చట్టం ముందు సమానత్వం), ఆర్టికల్ 16 (పబ్లిక్ ఉపాధిలో సమాన అవకాశాలు)లను ఉల్లంఘిస్తుం దని తీర్పు వెలువరించింది. ప్రభుత్వానికి రూల్స్ సవరించే స్వేచ్ఛ ఉందని స్పష్టం చేసింది. దీంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2024 మార్చి 14న జీవో నెంబర్ 47 ద్వారా సవరణలు చేసింది. ఆ జీవోలను "కేవలం మహిళలు" అనే పదాలను "పురుషులు మరియు మహిళలు"గా మార్చింది. ఈ సవరణలను అదే ఏడాది ఏప్రిల్ 3న ఆంధ్రప్రదేశ్ గెజిట్‌లో ప్రచురించారు. తెలంగాణ రాష్ట్రంలోనూ ఉద్యోగో న్నతు ల్లో పురుషులకు సమాన అవకాశాలు కల్పించేందుకు వీలుగా జిఒ నెంబర్లు 466, 101, 126లను సవరించి తమకు న్యాయం చేయాలని పలువురు పురుష నర్సింగ్ ఆఫీసర్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.